సాక్షి
విజయనగరం
శనివారం, 11, మే, 2024



ఆరోగ్యశ్రీతో పునర్జన్మ..
ఆరోగ్యశ్రీ పథకం అభాగ్యులకు అండగా నిలుస్తోంది. ఎంతోమందికి పునర్జన్మ ప్రసాదిస్తోంది. - VIII లో



స్వేచ్ఛగా ఓటువేద్దాం..
ఓటర్లందరూ స్వేచ్ఛగా ఓటు వేయాలని అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ పిలుపునిచ్చారు. - VIII లో



అడ్డగోలు రాతలు నమ్మొద్దు..
ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ఈనాడు రాస్తున్న తప్పుడు రాతలను నమ్మవద్దని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. - VIII లో

న్యూస్‌రీల్

రామతీర్థంలో వైభవంగా సహస్ర దీపాలంకరణ



రామతీర్థంలో సహస్ర దీపాలను వెలిగిస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన పూజలు నిర్వహించిన తరువాత యాగశాలలో నిత్య హోమాలు, వెండి మండపం వద్ద స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. సాయంత్రం 6 గంటలకు సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మండపంపైకి తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆశీనులు చేశారు. అనంతరం దీపాలు వెలిగించి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వద్దు

- ఎస్పీ ఎం.దీపిక



రాజాం సిటీ: ఎన్నికల విధులపై సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

రాజాం సిటీ: ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది అలసత్వం వహించవద్దని ఎస్పీ ఎం.దీపిక అన్నారు. రాజాంలోని ఓ కల్యాణ మండపంలో నాలుగు మండలాల పోలీస్ సిబ్బంది, ఎన్‌సీసీ వలంటీర్లు, రూట్ మొబైల్ సిబ్బందికి శుక్రవారం ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. బందోబస్తు విధులు, భద్రతా ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో అప్రమత్తంగా ఉండాలని, పార్టీలకు అతీతంగా విధులు నిర్వహించాలని ఆమె సూచించారు. పోలింగ్ బూత్‌కు 100 మీటర్ల పరిధిలో ఓటర్లు మినహా మరెవరూ ఉండకూడదని, 200 మీటర్ల దూరంలో వాహనాలు నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సిబ్బంది అంతా కృతనిశ్చయంతో పనిచేయాలన్నారు. ఎటువంటి సమస్య తలెత్తినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో చీపురుపల్లి డీఎస్పీ ఎ.ఎస్.చక్రవర్తి, ట్రైనీ డీఎస్పీ మహేంద్ర, సీఐలు డి.మోహనరావు, ఎస్.శ్రీనివాసరావు, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి మోహనుడు..!



రాజాంలో మాజీ మంత్రి అనుచరులు ఆక్రమించిన మల్లమ్మ చెరువు

- నాగావళి నదిని ఆదాయవనరుగా మార్చుకున్న మాజీ మంత్రి
- నారాయణపురం ఆనకట్ట సమీపంలో ఇసుక అక్రమ తవ్వకాలు
- విచ్చలవిడిగా విశాఖపట్నంకు తరలింపు
- తన అనుచరులతో రాజాంలో కబ్జాలు, విక్రయాలు
- మంత్రి పదవితో భారీగా కాంట్రాక్టర్ల వద్ద దందాలు
- ఏ పనికావాలన్నా ఫైనలివ్వాల్సిందే..
- ఎన్నికలప్పుడే ఇక్కడ.. తరువాత విశాఖపట్నమే అడ్డా
- అప్పట్లో దోచుకున్న సొమ్ము.. నేడు ప్రచారాలకు వినియోగం
- ఆయన అరాచక పాలనను ఛీకొడుతున్న జనం

సాక్షి నెట్‌వర్క్: ప్రజలు ఇచ్చిన పాలనావకాశాన్ని ఆయన అక్రమ సంపాదనకు వరంగా మార్చుకున్నారు. వైఎస్సార్ ఉన్నంతకాలం సౌమ్యుడిగా ఉన్న ఆ నేత ఆయన మరణానంతరం జిత్తుల మారిన నక్కలా ఎత్తులు వేశాడు. అక్రమ సంపాదన, ఆక్రమణలపై దృష్టిసారించాడు. విప్, మంత్రి పదవులను అడ్డుపెట్టుకుని, తన చేతికి 'ఇసుక' అంటకుండా అక్రమాలకు పాల్పడ్డాడు. అడ్డొచ్చినవారిపై బినామీలతో కేసులు పెట్టిస్తూ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు దిగేవాడు. అదొక చీకటి ప్రపంచంగా ఉండేది. ఆయన తీరును చూసిన రాజాం వాసులు ఎన్నికల్లో ఓడించి గట్టిగా బుద్ధిచెప్పారు. ఎమ్మెల్యేలు

నదీ ప్రవాహం మారిపోయేలా ఇసుక తవ్వకాలు

2010–14 మధ్యకాలంలో సంతకవిటి మండలం పోతులుజగ్గుపేట వద్ద నాగావళి నదిలో అనాధికార ఇసుక క్వారీ నడిచేది. మాజీ అమాత్యుడు తన పలుకబడి ఉపయోగించి ఈ క్వారీని నిర్వహించేవాడు. పోతులుజగ్గుపేట, రంగారాయపురం, మేడమర్తి గ్రామాల ప్రజలు ఇసుక క్వారీని అడ్డుకోవాలని ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. మాజీ మంత్రి ఇష్టానుసారం ఇక్కడ ఇసుక తవ్వి విశాఖలో వ్యాపారం చేసేవాడు. ఇసుక తవ్వకాలతో నారాయణపురం ఆనకట్ట నుంచి వచ్చే నాగావళి నది నీటి ప్రవాహం పోతులజగ్గుపేట గ్రామం వైపు మళ్లింది. ఈ ప్రాంతంలో అప్పట్లో నదీతీర పొలాలగట్లు ఎకరాల మేర కోతకు గురయ్యాయి. నీటి ప్రవాహం నేరుగా గట్టును తాకుతూ వచ్చి ప్రజలను భయపెట్టేది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నారాయణపురం ఆనకట్ట వద్ద అప్రాన్‌ను పునఃనిర్మించడంతో ఈ సమస్యకు చెక్ పడింది.



సంతకవిటి మండలం పోతులజగ్గుపేట వద్ద గతంలో మాజీ మంత్రి ఇసుక తవ్విన ప్రాంతం ఇదే..

మారడంతో పరిస్థితి మారింది. రాజాం ప్రశాంత వాతావరణంలోకి వచ్చింది. ఇప్పుడిప్పుడే అభివృద్ధి పవనాలు వీస్తున్నాయి. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఆనందంగా జీవిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో గత నాలుగేళ్లు ఎక్కడో ఉన్న ఆ మాజీ మంత్రి మళ్లీ రాజాంలో అడుగుపెట్టారు. అధికారం కోసం తహతహలాడుతున్నారు. ఆయన అరాచక పాలన, కన్నింగ్ మెంటాలిటీ తెలిసిన వారు దూరంగా ఉంటూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ఎన్నికలప్పుడే ఇక్కడ..

ఎన్నికల సమయంలో మాత్రమే ఆ నేత ఇక్కడ ఉంటారు. అనంతరం అతని బ్యాచ్ ఇక్కడ కథ నడుపుతుంది. ఎవరికి కాంట్రాక్టులు వచ్చినా ఒప్పుకోరు. ఆ నాయకుడి సోదరునికి మాత్రమే పెద్దపెద్ద కాంట్రాక్టులు దక్కాలి. లేదంటే కాంట్రాక్టులు దక్కించుకున్న వారు 15 నుంచి 20 శాతం కమీషన్ చెల్లించాలి. ఆ నాయకుడు విశాఖపట్టణంలో ఉంటూ తనకు మట్టి అంటకుండా వ్యవహారం నడుపుతాడు. తనకు అడ్డుగా వచ్చిన నాయకులు, చివరికి తనను గెలిపించిన కార్యకర్తలైనా లెక్క ఉండదు. వారిపై బినామీలతో కేసుల్లో ఇరికించడం, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేయడం చేస్తారు. రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలాలు, పోరంబోకు జాగాలు, చెరువు గర్భాలు మొత్తం మాయమౌతాయి. సులభంగా వీటిని ఆక్రమించి, వెంటనే ఈ బ్యాచ్ తమపేరు బయటకు రాకుండా ఇతరులకు విక్రయిస్తారు. ఆయన అక్రమాలతో రంగప్పచెరువు దగ్గర నుంచి అటు మల్లమ్మ కోనేరు వరకూ అన్నీ కనుమరుగయ్యే పరిస్థితి. ఈ అక్రమాల నేత ఇప్పుడు రాజాం పట్టణంపైనా కన్నేసినట్టు సమాచారం. అక్కడ ఖాళీ స్థలాలు, చిరువ్యాపారాలు చేసుకునేవారి జాగాలను ఇప్పటికే తన మనుషులతో సర్వేచేసినట్టు బోగట్టా.

అన్ని మండలాల్లోనూ దందాలే.

అప్పట్లో సంతకవిటి మండలంలోనే కాకుండా రేగిడి, వంగర మండలాల్లో కూడా మాజీ మంత్రి అనుచరులు ఇసుక వ్యాపారం చేసేవారు. అదే ఇసుక బ్యాచ్ ప్రస్తుత ఎన్నికల్లో ఆయన వెంట నడుస్తోంది. వీరిని చూసిన నదీతీర గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పొరపాటున ఓటేస్తే నదితో పాటు తమ గ్రామాల ఉనికికే ప్రమాదమని బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. రాజాంను మాఫియా సామ్రాజ్యంగా మార్చేస్తారని చెబుతున్నారు. అప్పట్లో మంత్రి ఇసుక వ్యాపారానికి ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థిని బలైంది. ఇసుక లారీ ఢీకొని మృతిచెందినా... అధికార బలంతో కేసులేకుండా చేసుకున్నారు. ఇసుక అక్రమ తరలింపు వ్యవహారాలు వెలికి తీయాలనుకునేవారికి హెచ్చరికలు జారీచేశారు. రాజాం ప్రశాంతంగా ఉండాలంటే ఆ మాజీ మంత్రిని 2014, 2019లో వలే 2024 ఎన్నికల్లోనూ ఓడించాలని కొందరు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. వీరికి చాలా గ్రామాల ప్రజలు మద్దతు తెలుపుతూ.. అవినీతిపరుడైన మాజీ మంత్రికి గుణపాఠం చెప్పేందుకు సిద్ధమవుతున్నారట.

చీపురుపల్లిలో కళతప్పిన టీడీపీ



- 'కళ'ను కలవలేని టీడీపీ శ్రేణులు
- ఆయనను కలవాలంటే ముందు ఆరుగురిని కలవాలట!
- ఎందు'కళా' అంటూ పార్టీ శ్రేణుల్లో ఆవేదన
- ఆయన వెనుక వెళ్లేందుకు ససేమిరా
- ఉన్న కొద్దిపాటి క్యాడర్ జారుకుంటున్న వైనం
- ఏ స్థాయి నేతలైనా పీఏతోనే మాట్లాడాలా? అంటూ మండిపాటు
- చాలుచాలులే అంటూ మొహంమీదే చెబుతున్న పరిస్థితి

చీపురుపల్లి: వాస్తవంగా ఆయన వలస నేత. ఆయన ఏ నియోజకవర్గంలో పోటీ చేసినా సొంత ఇల్లు ఉండదు. ఆఫీసు ఉండదు. ఆయనను అనుచరులూ నమ్మరు. ఎన్నికల వేళ ఉపయోగించుకోవడమే తప్ప... ఆపద వేళ ఆదుకోవడం ఆయనకు తెలియదు. ఆర్థికంగా కుంగిపోయినా రూపాయి సాయం చేసే గుణం లేదు. నాలుగు దశాబ్దాల సీనియారిటీ ఉందని చెప్పుకునే ఆయనకు ఆ నియోజకవర్గంలో కనీసం అద్దెకు ఇల్లు కూడా తీసుకోరు. ఎన్నికల ప్రచారంలో తిరగడం, తీరా గెలిచినా, ఓడినా సరే విశాఖ, విజయవాడ, హైదరాబాద్‌లలో గడపడం ఆయనకు అలవాటు. ఓటమి చెందితే ఎలాగూ కనిపించని ఆ సీనియర్ నేత గెలిచినా సరే ప్రజలు ఎలా ఉన్నారో, నియోజకవర్గం అభివృద్ధి ఏమిటో కనీసం పట్టించుకోరంటూ ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన టీడీపీ శ్రేణులు చెప్పే మాటలతో చీపురుపల్లిలోని పార్టీ శ్రేణుల్లో గుబులు రేగుతోంది. పార్టీ శ్రేణుల్లో 'కళ' తప్పింది. ఓటమి ఖాయమని తెలిసినా కొద్దిమంది నాయకులు ఆయన వెంట నడుస్తున్నారు. ఆయన తీరు తెలిసి నైరాశ్యంలోకి వెళ్లిపోయారు. 2014లో ఎచ్చెర్లలో గెలుపొంది, మంత్రి పదవి అలంకరించి ఆ నియోజకవర్గానికి ఏమైనా చేశారా అంటే అక్కడి ప్రజలు సున్నా సింబల్ చూపిస్తున్న దుస్థితి. దీంతో ఆయన నాయకత్వాన్ని 2019లో అక్కడి ప్రజలు తిరస్కరించారు. ఓటమి చెందాక ఐదేళ్లు ఆ నియోజకవర్గ ప్రజలకు కనీసం ముఖం కూడా చూపించలేదట. ఆ వలసనేత తీరు ఇప్పుడు చీపురుపల్లి నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. సొంత కుటుంబ సభ్యులకే వెన్నుపోటు పొడిచే నైజం ఉన్న నాయకుడు ఇప్పుడు ప్రజలను ఏం ఉద్ధరిస్తాడన్న చర్చ రచ్చబండలపై సాగుతోంది.

అంతా పీఏ కన్నుసన్నల్లోనే...

నలభై ఏళ్ల సీనియారిటీ ఉన్న ఆయన ప్రజలకు ఎలాగూ ముఖం చూపించరు సరికదా.. గ్రామ, మండల స్థాయిలో పార్టీ క్యాడర్‌నూ కలవరట. ఏదైనా కష్ట, సుఖాలు చెప్పుకోవాలన్నా, అభివృద్ధి కోసం మాట్లాడాలన్నా సరే ఆయన అపాయింట్‌మెంట్ ఉండదట. పార్టీ క్యాడరైనా, నాయకులైనా ఎవరైనా సరే పీఏగా ఉన్న వెంకటేశ్వరస్వామిని కలుసుకుని తమ గోడు వెల్లబోసుకుని అక్కడ నుంచి వెళ్లిపోవాల్సిందే. ప్రస్తుతం కొత్త నియోజకవర్గమైన చీపురుపల్లిలో కూడా అదే పరిస్థితి క్యాడర్‌కు ఎదురవుతోందనే చర్చ ఆ పార్టీ సోషల్ మీడియా గ్రూపుల్లోనే సాగుతుండం గమనార్హం. ఇంకా ఎన్నికలు జరగలేదు. గెలుపు, ఓటములు సంగతి పక్కన పెడితే ప్రస్తుతం కూడా క్యాడర్‌తో ఆయన మాట్లాడే పరిస్థితి లేదని, పీఏతోనే ప్రతీ విషయం చెప్పుకోవాల్సి వస్తోందని నాయకులు తలలు పట్టుకుంటున్నారు. అందుకనే ఆ సీనియర్ ఏ నియోజకవర్గం వదిలి వెళ్లిపోయినా అక్కడ క్యాడర్ అంతా పండగ చేసుకుంటారని టీడీపీ వర్గీయుల్లోనే చర్చ జరుగుతోంది.

నిరంతరం ప్రజల మధ్యనే...

- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: నిరంతరం ప్రజల మధ్యలోనే తామంతా ఉన్నామని, భవిష్యత్‌లో కూడా ఉంటామని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కోఆర్డినేటర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని హడ్కోకాలనీ, విజయాకాలనీ, జి.అగ్రహారం తదితర ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో పాటు తామంతా స్థానికంగానే ఉంటూ నిరంతరం ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ సేవలు అందిస్తున్నామని, భవిష్యత్‌లో కూడా తామంతా ప్రజల కోసమే ఉంటామని భరోసా ఇచ్చారు. కొన్ని పార్టీలు నేతలు ఎన్నికలు తరువాత ఎక్కడుంటారో ప్రజలే తెలుసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ,



హడ్కోకాలనీలో జరిపిన ఎన్నికల ప్రచారంలో ఫ్యాన్ గుర్తు చూపిస్తున్న మజ్జి శ్రీనివాసరావు

కులం, మతం చూడకుండా సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. తిరిగి సంక్షేమ ప్రభుత్వం కొనసాగాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ నెల 13న జరనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా బొత్స సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థిగా బెల్లాన చంద్రశేఖర్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. చంద్రబాబు అబద్ధపు హామీలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర శిష్ట కకరణ కార్పొరేషన్ చైర్మన్ అనూష పట్నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, రమేష్, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

సైలెన్స్ ప్లీజ్..!

- నేటి సాయంత్రంతో మూగబోనున్న మైకులు
- అమల్లోకి 144వ సెక్షన్
- 12న పరిమితి సంఖ్యలో ఇంటింటి ప్రచారానికి అవకాశం
- కలెక్టర్ నాగలక్ష్మి



విజయనగరం అర్బన్: సార్వత్రిక ఎన్నికల సమరానికి మరికొద్ది గంటలే సమయం ఉంది. ఈ నెల 13న జరగనున్న ఎన్నికలకు యంత్రాంగం సిద్ధమవుతోంది. దాదాపు మూడు వారాలకుపైగా ప్రచారాలతో హోరెత్తిన మైకులు మరికొద్ది సేపట్లో మూగబోనున్నాయి. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల ప్రచారం 11వ తేదీ సాయంత్రం 6 గంటలతో ముగియనుంది. ఆ తర్వాత 144వ సెక్షన్ అమల్లోకి వస్తుంది. 12వ తేదీన డోర్ టు డోర్ ప్రచారానికి హంగూ ఆర్భాటాలూ లేకుండా పరిమితి సంఖ్యలోనే వెళ్లడానికి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. ర్యాలీలు, సభలు, సమావేశాల నిర్వహణ, విందుల ఏర్పాటు, లౌడ్‌స్పీకర్ల వినియోగం వంటివి నిషేధం. అభ్యర్థుల తరఫున ప్రచారాలతో హోరెత్తించిన వాహనాలన్నింటికీ 11వ తేదీతో అనుమతి నిలిపివేస్తారు. ఎన్నికలకు 48 గంటల ముందు 11వ తేదీ సాయంత్రం 6గంటల నుంచి 13వ తేదీ రాత్రి 7 గంటల వరకు జిల్లాలోని మద్యం దుకాణాలను మూసివేయనున్నారు. 144వ సెక్షన్ అమల్లో ఉండడంతో ప్రజలు గుంపుగా తిరగడం..ఆయుధాలు, తుపాకీలు, పదునైన ఆయుధాలు, లాఠీలు, కర్రలు, రాళ్లు వంటివి వెంట తీసుకువెళ్లడం నిషేధమని కలెక్టర్ నాలక్ష్మి స్పష్టంచేశారు.

మద్యం, డబ్బు పంపిణీపై నిఘా

ఎన్నికలకు ఇంకా రెండు రోజులే గడువు ఉండడంతో అభ్యర్థులు మద్యం, డబ్బు, ఇతర కానుకల పంపిణీపై దృష్టి సారించారు. కూటమి అభ్యర్థులు ఓటరును ప్రసన్నం చేసేందుకు కానుకల అస్త్రాన్ని ఉపయోగిస్తుండగా..అధికార వైఎస్సార్‌సీపీ తాము అమలు చేసిన సంక్షేమ పథకాలే మరోసారి అధికారం కట్టబెడతాయన్న నమ్మకంతో ఉంది. ఎటువంటి పొరపాట్లకూ తావివ్వకుండా జిల్లా అధికారులు నిఘా మరింత కట్టుదిట్టం చేస్తున్నారు.

బొబ్బిలి బీసీలదే..

- బీసీ నాయకుల హయాంలోనే బొబ్బిలి అభివృద్ధి
- రాజుల పాలనలో ప్రజలకు కలిగిన మేలు శూన్యం
- జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటా సంక్షేమ వికాసం
- ప్రతి ఊరు ప్రగతి బాటలోనే..
- అక్కరకు వచ్చిన సేవలు
- రైతుల సాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ
- ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై టీడీపీవి అబద్ధాలు

ఇంటర్వ్యూ

బొబ్బిలి: చారిత్రక నేపథ్యం కలిగిన బొబ్బిలిని ప్రగతి పట్టాలెక్కించాం. కేవలం 59 నెలల జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటికీ సంక్షేమ పాలన చేరువైంది. ప్రతి ఊరు రూపురేఖలు మారేలా అభివృద్ధి చేశాం. ఇక్కడి రైతుల సాగునీటి సమస్యను పరిష్కరించగలిగాం. చెరకు రైతుల బకాయిలు పూర్తిస్థాయిలో చెల్లించాం. విశాఖపట్టణంలో పరిపాలనా రాజధాని, శ్రీకాకుళంలోని మూలపేటలో పోర్టు నిర్మాణం, భోగాపురంలోని అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు అందుబాటులోకి వస్తే బొబ్బిలిలోని గ్రోత్ సెంటర్‌కు కొత్త కళ వస్తుంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుంది. ఈ ప్రాంత యువతకు ఉపాధి కలుగుతుందని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. రెండు రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తంచేశారు. శుక్రవారం నిర్వహించిన సాక్షి ఇంటర్వ్యూలో బొబ్బిలి అభివృద్ధిని వివరించారు. ఆయన మాటల్లోనే..

సాక్షి: బొబ్బిలితో మీఅనుబంధమేంటి? అసలు బొబ్బిలి బీసీలదా? రాజులదా?

శంబంగి: బొబ్బిలి ముమ్మాటికీ బీసీలదే! 1977 నుంచి దాదాపు 2004 వరకూ రాజుల పెత్తనానికి వ్యతిరేకంగా బీసీలు పోరాడారు. వారి కోటలోకి వారు వెళ్లేందుకు భయపడే పరిస్థితులు అప్పుడున్నాయి. దాదాపు 30 సంవత్సరాల పాటు రాజుల ఆధిపత్యంపై బీసీలంతా యుద్ధమే చేశారు. తరువాత మోసపు మాటలు, అబద్ధాలతో రాజకీయాల్లోకి వచ్చిన రాజులు.. ఈ ప్రాంత ప్రజల మధ్యచిచ్చులు పెడుతూ వచ్చారు. ఫ్యాక్టరీలు అమ్మేసి ఆ సొత్తుతో మద్రాసు చెక్కేసే ప్రయత్నంలో రైతులు, కార్మికులతో పోరాటాలు సాగించి ఆస్తులను విక్రయించకుండా నిలపగలిగాం. 20 ఏళ్ల గ్యాప్‌లో కూడా తిరిగి ప్రజలు ఎమ్మెల్యేగా ఆశీర్వదించారంటే బొబ్బిలి ప్రజలతో తన అనుబంధం ఏపాటిదో అర్థమవుతుంది. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పనిచేయడం గర్వంగా ఉంది. ఈ స్థాయిలో సంక్షేమ, అభివృద్ధి పాలనను ఏ ముఖ్యమంత్రి కొనసాగించలేదు. బొబ్బిలి రాజులు ఈ ప్రాంతానికి చేసినది శూన్యం. అసలు ఈ ప్రాంత ప్రజలంటే బొబ్బిలి రాజులకు ఎప్పుడూ అయిష్టతే. అందుకే చెన్నైలోనే ఎక్కువగా గడుపుతారు. వారు విలాస జీవులు. ఈ ప్రాంత ప్రజల సమస్యలపైవారికి ఏ మాత్రం అవగాహన లేదు.

సాక్షి: నియోజకవర్గ అభివృద్ధిలో మీ లక్ష్యాలు?

శంబంగి: నియోజకవర్గంలో సంక్షేమ, అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.వందల కోట్లను ఖర్చు చేస్తోంది. బొబ్బిలి, తెర్లాం మండలాల్లోని తోటపల్లి కాలువపై ఎత్తిపోతలల పథకాల పూర్తికి కృషిచేస్తాను. ఇప్పటికే ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాను. గొల్లాది బ్రిడ్జి నిర్మాణం, పారాది, భోజరాజపురం వంతెనల నిర్మాణాలను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకున్నాం.

సాక్షి: బొబ్బిలిలో గ్రోత్ సెంటర్ ఎలా ఏర్పడింది?

శంబంగి: బొబ్బిలి ప్రాంతం పూర్తిగా రాజులకు భజనలతోనే గతంలో నడిచేది. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధికి నిర్ణయం తీసుకుంటే అందులో బొబ్బిలిలో ఒక నిర్మాణానికి ప్రాధాన్యతనిచ్చారు. చుట్టుపక్కల ఉన్న గ్రామాల నుంచి సుమారు 1200 ఎకరాల భూములను సేకరించి గ్రోత్ సెంటర్ ఏర్పాటైంది. దీని ప్రారంభోత్సవం నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే జరిగింది. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో విశాఖ రాజధాని, మూలపేట పోర్టు, భోగాపురం ఎయిర్ పోర్టులు త్వరలోనే సాకారం కానున్న నేపథ్యంలో బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఏపీఐఐసీ ద్వారా పారిశ్రామికాభివృద్ధి ఎలా ఉండబోతోందో ఊహించవచ్చు.

సాక్షి: బొబ్బిలి రాజులను ప్రజలు ఎందుకు వ్యతిరేకిస్తారని మీ నమ్మకం?

శంబంగి: బొబ్బిలి రాజులది ఆధిపత్యధోరణి. వారికి ప్రజల సంక్షేమం గురించి అవసరం లేదు. వారి ఆస్తుల రక్షణ కోసం రాజకీయాల్లోకి వచ్చారు. గతంలో బేబీ నాయన తన మీద పోటీ చేసిన ఓ మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థిని విత్‌డ్రా చేయించి ఎన్నికలయ్యే వరకూ తమ ఆధీనంలో ఉంచుకుని మున్సిపల్ చైర్మన్ అయ్యారు. ఆ తరువాత కౌన్సిల్ సమావేశాల్లో కౌన్సిలర్ల ప్రశ్నలకు, నిలదీతలను భరించలేకపోయిన బేబీ నాయన వైస్ చైర్మన్‌లకు గద్దె అప్పగించిన సంఘటనలు ప్రజలకు తెలుసు.

సాక్షి: బొబ్బిలిలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పనులు కొన్ని చెప్పండి?

శంబంగి: నియోజకవర్గంలోని బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం, తెర్లాం మండలాల్లో రైతులతో సమానంగా దళితులకూ భూమి కలిగి ఉండాలని, వారికి కూడా ఆ భూమిపై సర్వ హక్కులూ ఉండాలని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి భావించారు. కనుకనే నియోజకవర్గంలో 845 మంది దళితులకు రూ.కోట్ల విలువ చేసే 632.68 ఎకరాల భూమికి సర్వాధికారులూ కల్పించగలిగాం. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 12 మండలాల్లోని చెరకు రైతులకు ఎన్‌సీఎస్ సుగర్స్ ఎగ్గొట్టిన బకాయిలు రూ.42 కోట్లను చెల్లించినది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే. బుడా కార్యాలయం ఏర్పాటైంది. సేవలు అందుతున్నాయి. వివిధ సంక్షేమ పథకాల కింద నియోజకవర్గంలోని ప్రజలకు 59 నెలల పాలనలో రూ.2,508కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరింది.



సాక్షి: మీరు బొబ్బిలికి చేసిన పనులేమిటి? మీ ప్రత్యర్థులు చేసిన పనులేమిటి?

శంబంగి: బొబ్బిలిలో ఆస్పత్రి అభివృద్ధికోసం రూ.3.4 కోట్లతో కొత్త భవనాలు నిర్మించాం. మంత్రి బొత్స సత్యనారాయణ మంజూరు చేసిన నిధులతో బొబ్బిలి ప్రధాన రహదారిని పూర్తి చేశాం. త్వరలో ఏఐఐబీ నిధులతో బృహత్తర తాగునీటి పథకాన్ని పూర్తి చేయించి ప్రతీ రోజూ పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తాం. ప్రస్తుతం ఉన్న సీహెచ్‌సీని 100 పడకల ఆస్పత్రిగా విస్తరింపజేస్తాం. వాసిరెడ్డి విగ్రహం దగ్గర నుంచి ఎస్‌బీఐ, కృష్ణా టాకీస్ మీదుగా బజారు రోడ్డుతో పాటు కాలేజ్ రోడ్డు విస్తరణ పనులు పూర్తికి చిత్తశుద్ధితో కృషిచేస్తాం. కోర్టు, గురుకులం, వెంగళరాయ సాగర్ పథకానికి అటవీ అనుమతులు తీసుకొచ్చాం. రూ.62.04కోట్లతో తోటపల్లి పిల్ల కాలువల నిర్మాణం చేపట్టాం. రూ.13.45 కోట్లతో బొబ్బిలిలో రోడ్లు వేశాం. బొబ్బిలి రాజులు మా ప్రాంతానికి చేసిన పని ఒక్కటీ లేదు. బీసీలను అణగదొక్కడమే వారి అంతిమ లక్ష్యం. దీనికి కొందరు బీసీలు సహకరిస్తుండడం విచారకరం.

క్లుప్తంగా

శ్రీరాముడు ఆదర్శప్రాయుడు..



ఆధ్యాత్మిక ప్రవచనం అందజేస్తున్న చినజియర్ స్వామి

విజయనగరం టౌన్: శ్రీరామచంద్రమూర్తి ఎప్పటికీ ఆదర్శప్రాయుడని చినజియర్‌స్వామి అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేకం కార్యక్రమం కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మానవ రూపంలో పుట్టిన భగవంతుడు శ్రీరాముడని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గుణగణాలను వివరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా విజయ కుమార్, చెరుకూరి శ్రీధర్, రుత్విక్కులు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు బంద్

విజయనగరం క్రైమ్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 11వ తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచి 13వ తేదీ పోలింగ్ ముగిసే వరకు జిల్లా పరిధిలో ఉన్న 149 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 28 రెస్టారెంట్లు, బార్లు, 92 కల్లు దుకాణాలు, రెండు మెథనాల్ యూనిట్స్, ఒక డినేచర్డ్ ఇథనాల్ యూనిట్, 16 డినేచర్డ్ స్పిరిట్, ఆరు మొలాసిస్ యూనిట్లను కలెక్టర్ ఆదేశాల మేరకు మూసి వేస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఎన్‌వీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు ఎవ్వరూ మద్యం తాగడం గాని, విక్రయించడం గాని చేయరాదని పేర్కొన్నారు.

పైడితల్లి ఆలయానికి ఊయల వితరణ



ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఊయల

విజయనగరం టౌన్: భక్తులందరూ తమ పిల్లలను అమ్మవారి పాదాల చెంత ఉంచి ఆశీర్వాదం తీసుకోవడం పరిపాటి. ఈ క్రమంలో పైడితల్లి ఆలయంలో చిన్నారుల కోసం శుక్రవారం ఊయల ఏర్పాటు చేశారు. డాక్టర్ హరి జగన్ ఊయలను ఈఓ డీవీవీ ప్రసాదరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ, భక్తులు తమ చిన్నారులను అమ్మ సన్నిధానంలో ఊయలలో వేసి ఆశీర్వాదం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అర్చకులు తాళ్లపూడి ధనుంజయ్, ఏడిద వెంకటరమణ, మాజీ అర్చకుడు దూసి కృష్ణమూర్తి, మాజీ సిబ్బంది అప్పలనాయుడు, ఆర్.సూర్యపాత్రో, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు 120 బస్సులు

విజయనగరం అర్బన్: ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, సామగ్రి రవాణా కోసం 120 ఆర్టీసీ బస్సులను కేటాయిస్తున్నామని కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం బస్ స్టేషన్ నుంచి రాజాంనకు 25 బస్సులు.. చీపురుపల్లికి 8 బస్సులు.. గజపతినగరానికి 40 .. ఎస్.కోటకు రెండు.. బొబ్బిలికి 10.. నెల్లిమర్లకు ఒక బస్సు బయలుదేరుతారని పేర్కొన్నారు. అదేవిధంగా ఎస్.కోట నుంచి బొబ్బిలికి 15 బస్సులు, విజయనగరానికి 10.. చీపురుపల్లికి 2 బస్సులు బయలుదేరుతాయన్నారు. బొబ్బిలి, విజయనగరం నియోజకవర్గాలకు జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో.. ఎస్.కోట, రాజాం, చీపురుపల్లి, నెల్లిమర్ల, గజపతినగరం నియోజకవర్గాలకు లెండి ఇంజినీరింగ్ కళాశాలలో రిసెప్షన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ ముగిసిన పిదప ఎన్నికల సిబ్బంది రిసెప్షన్ సెంటర్లలో ఎన్నికల సామగ్రి అందజేయాలన్నారు. సిబ్బంది తిరుగు ప్రయాణం కోసం కూడా బస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇతర జిల్లాలకు వెళ్లవలసిన సిబ్బంది మాత్రం సాధారణ బస్సు చార్జీలు చెల్లించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో త్యాగరాజ జయంతి

విజయనగరం టౌన్: ఫ్రెండ్స్ ఫైనార్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కొత్తపేటలో శ్యామశాస్త్రి, త్యాగరాజస్వామి జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రముఖ వైద్యురాలు రోటరీ ప్రెసిడెంట్ డాక్టర్ ఐ.కృష్ణకాంతి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన గాత్ర కచేరీ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రముఖ మృదంగ విద్వాంసుడు డాక్టర్ మండపాక రవికి ఆకాశవాణిలో టాప్ గ్రేడ్ వచ్చిన సందర్భంగా నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ధవళ సర్వేశ్వరరావు, ధన్వాడ సుధాకర్, టి.మహేశ్వరరావు, తదితరులుపాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹153	₹276	₹286

ఆరోగ్యశ్రీతో పునర్జన్మ..

- గుండె రోగులకు అండగా నిలుస్తున్న పథకం
- ఏటా వేలాది మందికి శస్త్రచికిత్సలు
- ఐదేళ్లలో 2.56 లక్షల మందికి ఆపరేషన్లు
- ఇంతవరకు చేసిన ఖర్చు రూ.537.01 కోట్లు
- జిల్లాలో 33 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యశ్రీ పథకం అభాగ్యులకు అండగా నిలుస్తోంది. ఎంతోమందికి పునర్జన్మ ప్రసాదిస్తోంది. ముఖ్యంగా నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు ఈ పథకం సంజీవినిలా పని చేస్తోంది. వైద్యం ఖర్చు వెయ్యి రూపాయలు దాటితే ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేస్తుండడంతో లక్షలాది మంది పేదలకు ఊరట లభిస్తోంది. గుండె, క్యాన్సర్ వంటి జబ్బుల బారిన పడినవారు చికిత్స చేయించుకోవాలంటే లక్షలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితులుండేవి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స అంటే ఇక ఆస్తులు అమ్ముకోవాల్సిందే. ఇటువంటి పరిస్థితులో వారి పాలిట ఆరోగ్యశ్రీ వరంగా మారింది. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఈ పథకం ప్రవేశపెట్టగా.. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిధిని 25 లక్షల రూపాయలకు పెంచారు. ఆరోగ్యశ్రీకార్డు ఉంటే కార్పొరేట్ ఆస్పత్రుల్లో సైతం వైద్య సేవలు పొందవచ్చు. లక్షల రూపాయల విలువైన ఆపరేషన్లే కాదు డెంగీ, మలేరియా వంటి వ్యాధులకు సైతం ఆరోగ్యశ్రీలో చికిత్స అందిస్తున్నారు.



☛ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు సిగడపు విజయలక్ష్మి. ఈమెది సాలురు గ్రామం. ఓ రోజు ఆయాసంగా ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆమెను విజయనగరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఈసీజీ, స్కానింగ్ పరీక్షలు చేసిన తర్వాత గుండెకు ఆపరేషన్ చేయాలన్నారు. దీంతో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆమెకు శస్త్రచికిత్స చేశారు.



సర్వజన ఆస్పత్రిలో ఉన్న ఆరోగ్యశ్రీ హెల్ప్‌డెస్క్



☛ ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు కానూరు శ్రీను. ఇతనిది దత్తిరాజేరు మండలం ఇంగిలాపల్లి గ్రామం. ఆయాసం, నీరసంగా ఉంటుందని విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించగా, అతనికి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. ఇతనికి ఆరోగ్యశ్రీ కార్డు ఉండడంతో ఉచితంగా శస్త్రచికిత్స చేయడంతో ప్రాణాలతో బయటపడ్డాడు.

33 ఆస్పత్రులు

జిల్లాలో 33 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులున్నాయి. ఇందులో ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులు 18 ఉన్నాయి. అదేవిధంగా ప్రభుత్వ నెట్‌వర్క్ ఆస్పత్రులు 15 ఉన్నాయి. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రస్తుతం 2,446 వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు.

2.56 లక్షల శస్త్రచికిత్సలు

జిల్లాలో 2019 నుంచి 2024 మార్చి నాటికి 2.56 లక్షల శస్త్రచికిత్సలు చేశారు. ఇందుకోసం ప్రభుత్వం 537.01 కోట్ల రూపాయలు వచ్చించింది. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా చికిత్స అందిస్తున్నారు.

ఐదేళ్లలో ఆరోగ్యశ్రీ సేవల వివరాలు..

సంవత్సరం	రోగుల సంఖ్య	వైద్యానికి చేసిన ఖర్చు
2019–20	31,357	రూ. 73.06 కోట్లు
2020–21	35,776	రూ.84.69 కోట్లు
2021–22	62,508	రూ.123.59 కోట్లు
2022–23	61053	రూ. 123.61 కోట్లు
2023–24	65,374	రూ. 126.75కోట్లు



☛ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు మోహన్‌రావు. ఇతనిది తెర్లాం గ్రామం. దగ్గు, ఆయాసం వస్తుందని విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించగా ఈసీజీ, టూడీ ఎకో పరీక్షలు చేశారు. ఇతనికి కూడా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా గుండె ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం ఇతను కుటుంబ సభ్యులతో సరదాగా గడుపుతున్నాడు.

పోలింగ్ శాతం నమోదుకు ప్రత్యేక సిబ్బంది

- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: కంట్రోల్ రూమ్ నుంచి ఎన్నికల పోలింగ్ శాతాన్ని నమోదు చేయడానికి సెక్టార్ల వారీగా ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ, పోలింగ్ రోజున (13వ తేదీ) ప్రతి 2 గంటలకు పోలింగ్ శాతాన్ని కలెక్టరేట్‌కు తెలియజేయాలన్నారు. జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ ఓవరాల్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారని.., సెక్టార్ వారీగా సేకరించిన సమాచారాన్ని కన్సాలిడేట్ చేసి అందించడానికి ఒక ప్రత్యేక టీమ్‌ను నియమించనున్నట్లు తెలిపారు. ఈ బృందాలు 12వ తేదీన కంట్రోల్ రూమ్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. పోలింగ్ రోజుకు ముందురోజున పోలింగ్ స్టేషన్లకు ఎన్నికల సిబ్బంది హాజరు, మాక్ పోలింగ్ ప్రారంభం, ఓటర్ టర్న్ అవుట్, తదితర వివరాలను పోలింగ్ స్టేషన్ల వారీగా రిపోర్ట్ చేయాలని సూచించారు. పోలింగ్ అనంతరం రిసెప్షన్ సెంటర్‌కు చేరేవరకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు.

స్వేచ్ఛగా ఓటువేద్దాం..



నృత్యం చేస్తున్న విద్యార్థులు

- అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్
- ఉత్సాహంగా ఫ్లాష్ మాబ్

విజయనగరం అర్బన్: ఓటర్లందరూ స్వేచ్ఛగా ఓటు వేయాలని అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ అన్నారు. ఓటు మన భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని చెప్పారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని దాసన్నపేట రైతుబజార్ జంక్షన్, గాంధీ బొమ్మ జంక్షన్, కలెక్టరేట్ జంక్షన్ వద్ద విద్యార్థులు శుక్రవాం ఫ్లాష్‌మాబ్ నిర్వహించి, ఓటుహక్కు ప్రాధాన్యతను వివరించారు. అసిస్టెంట్ కలెక్టర్ త్రివినాగ్ సైతం విద్యార్థులతో కలసి నృత్యం చేసి ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేవైసీ యాప్‌లో ప్రతి అభ్యర్థి వివరాలు ఉన్నాయని.. వాటిని చూసి సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకుని శతశాతం ఓటింగ్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి, హౌసింగ్ పీడీ శ్రీనివాసారావు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, రిసోర్స్‌పర్సన్ పద్మనాభం, హౌసింగ్ అధికారులు, సిబ్బంది, ఆర్కే డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

విజయనగరం ఫోర్ట్: అక్షయ తృతీయ సందర్భంగా బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున జిల్లాలోని 15 మండలాల్లో శుక్రవారం ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించినట్లు యూత్‌క్లబ్ ఎక్వీస్ ఫర్ జస్టిస్ సమన్వయకర్త జి.ఝాన్సీరాణి తెలిపారు. ఈ మేరకు పలు ప్రాంతాల్లో నిర్వహించిన సదస్సుల్లో ఆమె మాట్లాడుతూ, బాల్య వివాహాల ఎన్నో అనర్థాలు కలుగుతాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో యూత్ క్లబ్ డైరెక్టర్ ఎం. ప్రసాదరావు, రామకోటి, ఫల్గుణ, తదితరులు పాల్గొన్నారు.



లక్కవరపుకోట: వారంతా రాత్రీ పగలు కష్టపడి చదివారు. ఉపాధ్యాయ కోర్సు పూర్తిచేసి డీఎస్సీకి అర్హత సాధించారు. కోర్టు వివాదంతో వారు ఉద్యోగాలకు దూరమయ్యారు. వారి సమస్య పరిష్కారానికి రెండు దశాబ్దాల పాటు ఏ పాలకుడూ కనీసం చొరవ చూపలేదు. సాహసం చేయలేదు. వారి వేదనను పట్టించుకోలేదు. వారికి మేలు కలిగేలా నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోన్‌రెడ్డి 2018 సంవత్సరంలో నిర్వహించిన ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా నిర్వహించిన పాదయాత్రలో 1998 డీఎస్సీ అభ్యర్థులు వారి సమస్యను ఏకరువు పెట్టారు. ఉన్నత విద్యావంతులైన ఉపాధ్యాయ అభ్యర్థుల సమస్యను జగన్‌మోన్ రెడ్డి సావదానంగా ఆలకించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 1998 డీఎస్సీలో అర్హత పొందిన వారందరికీ ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా 4,072 మందికి, జిల్లాలో 490 మందికి పోస్టింగ్‌లు కేటాయించి వారిలో ఆనందం నింపారు. అందుకే వారంతా మా మంచి సీఎం అంటూ జగన్‌ను ప్రశంసిస్తారు. ఎన్నికలవేళ హామీ ఇచ్చి 14 ఏళ్లపాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబునాయుడు మోసం చేశారంటూ ఇప్పటికీ ఆవేదన వ్యక్తంచేస్తుంటారు.

> ‘ఉపాధ్యాయుడు కావాలన్నది కల. డీఎస్సీకి కష్టపడి చదివాను. 1998 డీఎస్సీలో అర్హత సాధించినా కోర్టు వివాదంతో ఉద్యోగం రాలేదు. ఏళ్ల తరబడి పాలకుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూపంలో నా కల నెరవేరింది. విద్యార్థులకు చక్కగా బోధిస్తున్నాను. నా కల నెరవేర్చిన సీఎం రుణం తీర్చుకోలేనిది. మా మంచి సీఎం ఆయన.
>
> – ఎల్.కోటకు చెందిన 1998 డీఎస్సీ ఉపాధ్యాయుడు మాట ఇది.

> మాది కొత్తవలస మండలం. ప్రజాసంకల్పయాత్రగా వచ్చిన అప్పటి ప్రతిపక్ష నేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మా సమస్యను వివరించాం. అర్హత సాధించి ఉద్యోగానికి దూరమైన తీరును తెలియజేశాం. అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయం చేస్తామన్నారు. ఉద్యోగాలు కల్పించి మా కుటుంబాల్లో కొత్త వెలుగు నింపారు. ఈ రోజు పిల్లాపాపలతో ఆనందంగా ఉన్నామంటే ఆయన దయే. ఏ ముఖ్యమంత్రి తీసుకోలేని సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. పాలకుడంటే అలా ఉండాలి. గతంలో మేము చదువుకునేటప్పుడు పాఠశాలలో కనీసం మరుగుదొడ్డి ఉండేది కాదు. ఇప్పుడు పాఠశాలలను చూస్తే ముచ్చటేస్తోంది. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు ఉజ్వల భవితకు ప్రభుత్వ బడులు భరోసాగా నిలుస్తున్నాయి.
>
> – ఉద్యోగం పొందిన ఓ ఉపాధ్యాయుడి ఆనందం ఇది

> మా ఆయన బాగా చదువుకున్నారు. 1998 డీఎస్సీలో అర్హత సాధించినా ఉద్యోగం రాకపోవడంతో ఎంతో వేదనకు గురయ్యేవారు. ఊరిలోని వ్యక్తుల సూటిపోటిమాటలకు బాధపడేవారు. కష్టపడి చదివినా ఫలితం లేకపోయిందంటూ మనోవేదన చెందేవారు. ఆర్థికంగానూ ఇబ్బందులు పడ్డాం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూపంలో మా ఆయనకు ఉద్యోగం వచ్చింది. సంతోషంగా ఉన్నాం. మేము ఉదయం లేచి ముందు చూసేది సీఎం ఫొటోనే. ఆయన మేలు ఎన్నటికీ మరచిపోలేనిది.
>
> – జామి మండలానికి చెందిన ఓ ఉపాధ్యాయుడి భార్య సంతోషం ఇది

వైఎస్సార్‌సీపీలో చేరికలు



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన గుజ్జింగివలస వాసులు

గుర్ల: మండలంలోని గుజ్జింగివలసకు చెందిన 30 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో శుక్రవారం చేరాయి. పార్టీలో చేరిన వారికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బూడి చిన్నంనాయుడు , వార్డ్ మెంబర్ బూడి సత్యవతి, పంచాది అప్పలనాయుడు, పంచాది సూరప్పుడు, పతివాడ రాజీనాయుడు, పున్నపు రెడ్డి నర్సమ్మ, పెందుర్తి లక్ష్మణ, భీమిపల్లి నాగరాజు, లండ రాజబాబు, అంపోలు శంకర్‌తో పాటు మరో 20 కుటుంబాలున్నాయి.

అడ్డగోలు రాతలు నమ్మొద్దు..

- ల్యాండ్ టైట్లింగ్ యాక్టుపై ఈనాడు తప్పుడు రాతలు రాస్తోంది..
- మంత్రి బొత్స సత్యనారాయణ



కొర్లాం సభలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



గొల్లలమర్రివలసలో మంత్రి బొత్స సత్యనారాయణకు హారతులిస్తున్న మహిళలు

మెరకముడిదాం: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రవేశపెట్టిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ఈనాడు రాస్తున్న తప్పుడు రాతలను నమ్మవద్దని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మండలంలోని కొర్లాం, గొల్లల మర్రివలస, గరుగుబిల్లి, యాడిక గ్రామాల్లో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో మంత్రి బొత్స మాట్లాడుతూ, ఈనాడు పత్రిక ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌కు సంబంధించి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిపై లేనిపోని అభాండాలు వేస్తూ తప్పుడు కథనాలు ప్రచురిస్తోందన్నారు. ఇలాంటి కథనాలను నమ్మేస్థితిలో ప్రజలు లేరని.. ఈ విషయం రామోజీరావు గమనించాలని సూచించారు. అనేక సంక్షేమ పథకాలతో ప్రజలకు ఆర్థిక భరోసా కలిగించిన జగన్ మోహన్‌రెడ్డి తప్పుడు పనులు ఎన్నడూ చేయరని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు చెప్పిన కల్లబొల్లి మాటలకు మోసపోవద్దని సూచించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి చీపురుపల్లి శాసనసభ్యుడిగా తనను, విజయనగరం పార్లమెంట్ సభ్యుడిగా బెల్లాన చంద్రశేఖర్‌నుఅత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

అభివృద్ధే సేవకు తార్కాణం

మీ గ్రామాల్లో మంత్రి బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో చేసిన అభివృద్ధే మేం చేసిన సేవకు తార్కాణమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికల వేళ తెలుగుదేశం పార్టీ నాయకులు ఏ ముఖం పెట్టుకుని ఓటు అడుగుతున్నారో అర్థం కావడం లేదని చెప్పారు. నియోజకవర్గంలో తాము చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలందరికీ తెలుసన్నారు. మీకు ఎవరు సంక్షేమ ఫలాలు, అభివృద్ధిని చేపట్టారో విజ్ఞతతో ఆలోచించి ఓట్లు వేయాలని సూచించారు. రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మెరకముడిదాం మండలానికి పరిశ్రమలు తీసుకువచ్చేందుకు మంత్రి బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్‌వీ రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు జంపన సావిత్రమ్మ, సర్పంచ్ బూర్లె పార్వతమ్మ, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.సీతారామరాజు, ఎస్.కృష్ణమూర్తిరాజు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SINGLE SITTING

■ SINGLE SITTING : 10th, 12th, B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., M.B.A, BBA, BCA, B.Tech., D.Ed., B.Ed., Agriculture, Pharmacy, Nursing, (For Drop outs /Back Logs) from recognised Universities. Exams in May/June Cont: ✆ : 73383 76874 [R-451]

WANTED

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9948666206,9573633520. [M-1233978]


■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. Ph: 7995984445 [HA-117]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సాప్ చేయగలరు. 95026 15217 [M-1185073]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

- ఎస్.కోటలో 28 ఎకరాల్లో జగనన్న లేఅవుట్
- **1,004** మందికి ఇళ్ల పట్టాలు
- పూర్తయిన ఇళ్ల నిర్మాణాలు **300**
- వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలు: **554**
- తాగు, వాడుక నీటి సదుపాయం కోసం కేటాయించిన నిధులు రూ.**2.89** కోట్లు
- రూ.**60** లక్షలతో విద్యుత్ సౌకర్యం
- రూ.**3** కోట్లతో సీసీరోడ్లు, డ్రైన్‌లు, కల్వర్టులకు ప్రతిపాదనలు


ఎస్.కోటలోని వైఎస్సార్ జగనన్న కాలనీ

కోటలో కొత్త ఊరు

శృంగవరపుకోట:

పేదల సొంతింటి కల నిజం చేస్తానంటూ 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అక్షరాలా నిజం చేశారు. దశాబ్దాలుగా ఎస్.కోటలో ఉన్న నిరుపేదలు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇళ్లు మంజూరు చేయాలని ఎన్నో దఫాలు పోరాటాలు ఉద్యమాలు చేశారు. ఎవరు ఎన్ని పోరాటాలు చేసి నా కోటను ఏలిన తెలుగుదేశం పార్టీ పాలకులు ఏనాడూ పట్టించుకోలేదు. అక్కా ఒక్కసారి మాకు అధికారం ఇవ్వండి మీ కలలు నిజం చేస్తానంటూ మాటిచ్చి అధికారం అందుకున్న రెండేళ్లలోనే పేదోడి సొంత ఇంటి కలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిజం చేసి వారి గుండెల్లో చోటు సంపాదించుకున్నారు. ఎస్.కోటలో కోట్ల రూపాయల విలువ చేసే 28 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించారు. యుద్ధ ప్రాతిపదికన కోట్లు ఖర్చు పెట్టి రేయింబవళ్లూ పనులు చేసి, భూమిని అభివృద్ధి చేసి లేఅవుట్ వేయించారు. జిల్లాలోనే అతిపెద్ద 2వ జగనన్న కాలనీ అయిన ఈ లేఅవుట్ కొత్త ఊరుగా రూపుదిద్దుకుంది.

1,004 మందికి పట్టాలు

పేదరికమే అర్హతగా పార్టీలకతీతంగా పట్టణానికి చెందిన 1,004 మందికి ప్రభుత్వం ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేసింది. దరఖాస్తు చేసుకున్న 859 మందికి ఇళ్లు మంజూరు చేశారు. వీరిలో ఇప్పటికే 300 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి నివాసం ఉంటున్నారు. 554 ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

రూ.2.89 కోట్లతో నీటి సదుపాయం

ఇళ్ల నిర్మాణం కోసం కావాల్సిన మౌలిక వసతులు, సౌకర్యాలను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కల్పించింది. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణానికి వాడుకనీరు, జనానికి తాగునీరు కోసం రూ.2.89 కోట్లు కేటాయించారు. కాలనీలో 10 బోర్లు తీయించారు. 60 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు, 15 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న రెండు సంప్‌లు, 1,100 కుళాయిలకు ఈ నిధులు మంజూరు చేశారు. ఇప్పటికే 200 కుళాయిలు ఏర్పాటు చేసి నీరు అందిస్తున్నారు.

రూ.60 లక్షలతో విద్యుత్ సదుపాయం

కాలనీకి విద్యుత్ అవసరాల కోసం రూ.60 లక్షలు కేటాయించారు. 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు–16, 40 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు– 4, 1200 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. అడిగిందే తడవుగా ప్రతి ఇంటికి విద్యుత్ కనెక్షన్ మంజూరు చేస్తున్నారు.

రూ.3 కోట్లతో రోడ్లకు ప్రతిపాదనలు

ప్రస్తుతం కాలనీలోకి వెళ్లేందుకు స్లాబ్ కల్వర్టుకు రూ.10 లక్షలు కేటాయించారు. కాలనీలో సీసీ రోడ్లు, డ్రైన్ల కోసం మరో రూ.3 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రతి గడపకూ విద్యుత్, తాగునీటి కుళాయి, వీధిరోడ్డు, కాలనీలో పార్కులు, సచివాలయం, అంగన్‌వాడీ, హెల్త్ క్లినిక్ ఏర్పాటుకు స్థలాలు కేటాయించారు.

జగన్ చేసిన మేలు మరిచిపోలేం...



చాలా ఏళ్లుగా అద్దె ఇళ్లలో ఉన్నాం. జగన్ ఇంటి స్థలం ఇస్తానంటే ముందు నమ్మలేదు. ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేసింది. ప్రభుత్వం అందించిన సహాయం, కల్పించిన సదుపా యాలతో ఇంటి నిర్మాణం పూర్తి చేశాం. ఇప్పుడు ఆయన ఇచ్చిన ఇంటిలో చల్లగా ఉన్నాం. జగన్ చేసిన మేలు మరిచిపోలేం.

– ఆలవెల్లి వెంకటరత్నం, లబ్ధిదారు.

పేదోళ్ల గౌరవం పెంచిన నాయకుడు



పేదోళ్ల గౌరవం పెంచిన నాయకుడు జగన్. సొంత ఇల్లు లేక సంఘంలో గౌరవం, హోదా లేక, అద్దెలు కట్టలేక అవస్థలు పడుతున్న వేలాది మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్లు మంజూరు చేశారు. ప్రభుత్వమే లబ్ధిదారుల పేరు న ఇళ్ల రిజిస్ట్రేషన్ చేయించి హక్కులు కల్పించారు. సీఎం జగన్ పేదోళ్ల గౌరవం పెంచిన నాయకుడు.

– మేడపాటి కుమారి, లబ్ధిదారు

మాట నిలబెట్టుకున్నారు..



జగనన్న అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన పేదలకు లంచాలు, సిఫార్సులకు తావులేకుండా, ఇంటి స్థలం ఇచ్చి, ఇల్లు కట్టుకోవడానికి డబ్బులు ఇచ్చి పేదల కలను నిజం చేశాడు. ఇన్నేళ్లు పాలించి ఏమీ ఇవ్వలేని నాయకులు సిగ్గులేకుండా ఇప్పుడు కళ్లబొల్లి మాటలు చెబుతున్నారు. – ఆదిమూలం పార్వతి, లబ్ధిదారు

నాకు హోదా, ఆస్తి ఇచ్చింది జగన్



పేదోడి కష్టం, కల తెలిసినోడు జగన్. కూలి చేసుకుంటూ పరాయి పంచల్లో ఉండేదాన్ని. సీఎం జగన్ ఇంటి స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేశారు. ఈ రోజు ధైర్యంగా నా సొంత ఇంట్లో ఉన్నా, నాకు హోదా, ఆస్తి ఇచ్చింది జగనే. – కోడూరు పైడితల్లమ్మ, లబ్ధిదారు

గెలుపు కేక

ఊరూరా గెలుపు కేక వినిపించింది. సంక్షేమ పాలనకే మా ఓటు అన్న నినాదం మిన్నంటింది. ప్రతి కుటుంబం వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు హారతిచ్చి మనసారా ఆశీర్వదించింది. ప్రతి పల్లె విజయీభవ అంటూ దీవించింది.

– సాక్షి నెట్‌వర్క్

ప్రచార పర్వం


భోగాపురం మండలం సవరవిల్లిలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు అపూర్వస్వాగతం లభించింది. గ్రామస్తులందరూ వారి వెంట నడిచారు. గజమాలతో సత్కరించి, ఫ్యాన్ గుర్తుకే మా ఓటు అంటూ నినదించారు.


వైఎస్సార్‌సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్ బొద్దాంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ వర్షిణి హారతిచ్చి విజయతిలకం దిద్దారు.


రామభద్రపురం మేజర్ పంచాయతీలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి వెంకటర చినఅప్పలనాయుడుకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు హారతిచ్చి విజయతిలకం దిద్దారు.


గజపతినగరంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ సురేష్‌బాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్‌గుర్తుకు ఓటేయాలంటూ ఓటర్లను అభ్యర్థించారు.


వేపాడ మండలం పి.కె.ఆర్.పురంలో ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు గ్రామస్తులందరూ అండగా నిలిచారు. ప్రచారంలో పాల్గొని గెలుపుభరోసా ఇచ్చారు.

అష్టకష్టాలు 'నాయనా'?

- బొబ్బిలిలో గెలవలేమని టీడీపీ అభ్యర్థి బేబీ నాయనకు బెంగ!
- రెండేళ్లుగా గెలుపు తనదేనంటూ మీడియాలో తెగ ప్రచారం
- క్షేత్రస్థాయిలో పరిస్థితులన్నీ తారుమారవడంతో తలపట్టుకుంటున్న వైనం



సాక్షి ప్రతినిధి, విజయనగరం:

సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్ల ముందు నుంచే తనదే విజయం అన్నట్టుగా సోషల్ మీడియాలో, ఎల్లో మీడియాలో తెగ ప్రచారం చేయించుకున్న సదరు నాయకుడికి తీరా ఎన్నికలు వచ్చేసరికి క్షేత్రస్థాయిలో పరిస్థితులన్నీ తారుమారైపోయాయి. ఆయనెవ్వరో కాదు ప్రజాతీర్పును కాలదన్ని పదవుల కోసం వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి ఫిరాయించి ఇప్పుడు బొబ్బిలి నుంచి బరిలోకి దిగిన ఆర్‌వీఎస్‌కేకే రంగారావు ఉరఫ్ బేబీ నాయన!. అష్టకష్టాలు ఆయన్ను చుట్టుముట్టాయని సొంత పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

కలసిరాని సామాజిక వర్గం...

అసలే తక్కువ సంఖ్యాబలం ఉన్న బేబీనాయన సామాజిక వర్గం ఇప్పుడు కలసి రావడం లేదు. గతంలో సుజయ్ కృష్ణ పోటీ చేసినప్పుడు అండగా నిలబడినవారే ఇప్పుడు తేడా కొడుతున్నారు. సుజయ్‌కూ బేబీ నాయనకూ తేడా ఉండడమే కారణమట! సుజయ్‌కు తన సామాజిక వర్గానితో ఉన్నంత సాన్నిహిత్యం బేబీ నాయనకు లేదట. బొబ్బిలి పట్టణంలో ఇది ప్రభావితం చేస్తుందనే వాదనలు వినిపిస్తున్నాయి. పోనీ బీసీలైన కొప్పుల వెలమలనూ కలిపేసుకుందామంటే... ఎన్నికలప్పుడు తప్ప మరెప్పుడు వారిని కోటగుమ్మం కూడా ఎక్కనివ్వరే! విజయనగరం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఇన్నాళ్లూ వెన్నుముకగా ఉన్న తమకు ఒక్క సీటు కూడా చంద్రబాబు కేటాయించకపోవడంతో కొప్పుల వెలమ నాయకులు రగిలిపోతున్నారు. వెన్నుపోటు పొడిచే చంద్రబాబుకు ఓట్లతో బుద్ధి చెబుతామని ఇప్పటికే జిల్లా అంతా పోస్టర్లు వేసి మరీ హెచ్చరించడం తెలిసిందే.

ఆర్థిక నిల్వలు అయిపోయాయా?

బొబ్బిలిలో గెలుపు తనదేనంటూ రెండేళ్ల కిందట నుంచే బేబీ నాయన ప్రచారం చేయించుకున్నారు. ఇందుకోసం ఆహో ఓహో బ్యాచ్‌కి అన్ని ఖర్చులు చూసుకుంటూ వచ్చారు. ఇప్పుడు తీరా ఎన్నికలు వచ్చేసరికి వారంతా మళ్లీ డబ్బులు కావాలని అడుగుతున్నారట! కొంతమంది అలిగి కోట గుమ్మం కూడా ఎక్కట్లేదట! మిగతా వారు ఖర్చుల కోసమైనా ఇప్పించండంటూ బేబీ చుట్టూ తిరగాల్సి వస్తోందట! అయితే ఈసారి ఎన్నికల ఖర్చు విషయంలో కుటుంబ వర్గం ఫ్రీహ్యాండ్ ఇవ్వలేదని, అందుకనే ఈ ఇబ్బందులని బేబీ సన్నిహితులే చెప్పుకుంటున్నారు.

అశోక్ దెబ్బ అదుర్స్...

ఏ రఘురామకృష్ణ రాజో, సీఎం రమేషో, లేదంటే గంటా శ్రీనివాసరావో విజయనగరం ఎంపీ అభ్యర్థిగా వస్తే ఖర్చు కలిసొస్తుందనుకుంటే సీన్ రివర్స్ అయ్యింది. బొబ్బిలి రాజుకు విజయనగరం రాజు అశోక్ నొప్పి తెలియకుండా కొట్టిన దెబ్బ అదుర్స్ అనిపిస్తోంది. ఆ ముగ్గురిలో ఎవరు విజయనగరంలో అడుగుపెట్టినా ఏకులా వచ్చి మేకు అవుతారని, చివరకు కళావెంకటరావు ఎంపీ అభ్యర్థిగా వచ్చిన తన ఆధిపత్యానికి ఇబ్బంది అవుతుందని అశోక్ భావించారో ఏమో కానీ... అనూహ్య రీతిలో కలిశెట్టి అప్పలనాయుడిని తెరపైకి తెచ్చారు. విజయనగరం జిల్లాకు ఏమాత్రం పరిచయం లేదు సరికదా ఆర్థికంగానూ ఏమాత్రం ఖర్చు పంచుకోలేని పరిస్థితి కలిశెట్టిది. ఓట్లలోనూ, నోట్లలోనూ కలిసిరాని కలిశెట్టి తనకు భారమేనని బేబీ బెంగపడుతున్నారట!

బొబ్బిలి రాజంటే మాటలా...

వాడుకోవడంలో చంద్రబాబుకు మించినవారు లేరనేది బహిరంగ రహస్యం. కానీ ఆయన్నే మెప్పించి పార్టీకి విధేయుడిగా, పార్టీని ఆదుకునే నాయకుడిగా ముద్ర వేయించుకోవడానికి బొబ్బిలి రాజు గతంలో స్థాయికి మించి ఖర్చు చేసేశారు. ఇప్పుడదే ఆయనకు ఇబ్బందిగా మారింది. బొబ్బిలి రాజు అంటే మాటలా... ఆయనకే బోలెడు నిధి ఉంటుందనే రీతిలో పార్టీ అధిష్టానం భావిస్తుందట. పైసా కూడా పార్టీ ఫండ్ రావట్లేదట!

ఫిరాయింపు మచ్చ...

బేబీ నాయన ప్రజల్లోనూ పలుచన అవ్వడానికి, ప్రచారంలోనూ వెనుకబడటానికి మరో ప్రధాన కారణం గతంలో పార్టీ ఫిరాయించడమే. వైఎస్సార్ సీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఎంతో నమ్మకంగా రాష్ట్రస్థాయి పదవీ బాధ్యతలు అప్పగిస్తే... కేవలం రెండేళ్ల పాటు ఉండే మంత్రి పదవి కోసం టీడీపీలోకి జంప్ చేసేశారు. సంతలో పశువులా అమ్ముడు పోవడాన్ని నియోజకవర్గ ప్రజలు బాగా గుర్తుంచుకున్నారు. కార్యకర్తలు, కౌన్సిలర్ స్థాయిలో ఉన్న వారు కూడా మేం పార్టీ మారబోమని ఖరాకండీగా చెప్పినప్పటికీ నేరుగా అమ్ముడు పోవడం బొబ్బిలి రాజుల రాజకీయ జీవితాన్ని ప్రభావితం చేసిందని ప్రజలు అంటున్నారు.

ఏమైనా చేస్తే కదా చెప్పుకోవడానికి...

వై.ఎస్.రాజశేఖరరెడ్డి భిక్ష పెట్టిన రాజకీయ జీవితంలో ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నమ్మకంతో మూడుసార్లు ఎమ్మెల్యే అయిన సుజయ్ కృష్ణ రంగారావు, మున్సిపల్ చైర్మన్‌గా పదవి దక్కిన బేబీ నాయన బొబ్బిలి నియోజకవర్గంలో పిసరంత అభివృద్ధి పనిలేకపోవడం ఇప్పుడు మైనస్ అవుతోంది. మీరు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలంటూ ప్రస్తుత ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఎన్నోసార్లు సవాల్ విసిరినా బేబీ నాయన నిమ్మకు నీరెత్తినట్టు ఉండిపోవడానికీ కారణమూ అదే.

దిగిందమ్మా కారు బ్యాచ్...

గతంలో సుజయ్ ఓటమికి ఓ కారణమైన ఆయన సన్నిహితులు (కారు బ్యాచ్ అని బొబ్బిలిలో పేరు) మళ్లీ రంగంలోకి దిగడం బేబీ నాయనకు గడ్డు కాలం దాపురించిందనే చెప్పాలి. వారం రోజులుగా ఒక్కటే హడావిడి చేస్తున్నారు.

పూర్తిస్థాయి ఏర్పాట్లు


రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు పరిశీలిస్తున్న శ్రీకాకుళం నగర పాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా


ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రం

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలేం శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎనిమిది నియోజకవర్గాలకు సంబంధించి రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. మరో పక్క స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఏర్పాట్లను కళాశాలలో శ్రీకాకుళం నగర పాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా శుక్రవారం పర్యవేక్షించారు. ఎన్నికల పరిశీలకుల సూచన మేరకు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా రిసెప్షన్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిపెట్టారు. పోలింగ్ ముగిశాక 13వ తేదీ రాత్రి వేళ బస్సుల్లో ఈవీఎంలు రిసెప్షన్ కేంద్రాలకు తరలిస్తారు. రిసెప్షన్ కేంద్రాల నుంచి స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తారు. ప్రధానంగా జాతీయ రహదారి నుంచి కళాశాల వెలుపల నుంచి రోడ్లు నిర్మిస్తున్నారు. పార్కింగ్, ట్రాఫిక్ సమస్య లేకుండా వాహనాలు కళాశాలకు చేరేలా చర్యలు తీసుకుంటున్నారు. గత ఎన్నికల్లో పెద్ద ఎత్తున జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. అలాంటి పరిస్థితులు రాకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో సాగుతున్నారు.

గిరిజనం హర్షం

- ఆదివాసీలు ఉన్న చోటే గిరిజన వర్సిటీ
- నిర్మాణ ప్రదేశం మార్చాలన్న చంద్రబాబు కుట్రలకు చెక్
- మొదలైన యూనివర్సిటీ పనులు
- నిర్మాణానికి ఇప్పటికే రూ.800 కోట్లు మంజూరు



ఆగస్ట్25న గిరిజన వర్సిటీ భూమి పూజకు వచ్చిన కేంద్ర గిరిజన మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు బొబ్బిలి వీణ అంద చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి (ఫైల్)

దత్తిరాజేరు:

గిరిజనులు అధికంగా ఉన్న అరకు పార్లమెంట్, సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీ నిర్మాణం చేపట్టడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం హయంలో గిరిజనులు లేని చోట విశాఖపట్నం దగ్గరలో కొత్తవలస మండలంలోని రెల్లి గ్రామం వద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం భూసేకరణ చేయడంతో అక్కడ అనువైన ప్రదేశం కాదని నిపుణులు అప్పట్లోనే చెప్పారు. దీంతో 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో విద్యకు పెట్ట పీట వేయడంలో ముందుంది. ఈ నేపథ్యంలో సాలూరు–గజపతినగరం నియోజకవర్గాల మధ్య గిరిజన మండలమైన మెంటాడ–దత్తిరాజేరు మండలాల మధ్య 561.88 ఎకరాల భూమిని ప్రభుత్వ సేకరించింది. ఆ రెండు మండలాల పరిధిలో 90 ఎకరాల భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారాన్ని సంతృప్తికరంగా ప్రభుత్వం చెల్లించింది. రైతుల నుంచి సేకరించిన ఎకరా జిరాయితీ భూమికి రూ.9లక్షలు, ఎసైన్డ్ భూములకు రూ.7లక్షల నుంచి రూ.9లక్షల వరకు పరిహారంగా ప్రభుత్వం అందజేసింది.


గిరిజన యూనివర్సిటీ ఆవరణలో నిర్మాణంలో ఉన్న 20లక్షల లీటర్ల నీటి సామర్థ్యం ఉన్న వాటర్ ట్యాంక్

రైలు, విమాన మార్గాలకు దగ్గరగా

జాతీయ రహదారికి కిలోమీటరున్నర దూరంలో మర్రివలసలో యూనివర్సిటీ నిర్మాణం చేపట్టడం వల్ల వైజాగ్ సముద్రానికి 70 కిలో మీటర్ల దూరం, భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు 60 కిలోమీటర్ల దూరంలో వాయు, జలరవాణా అందుబాటులో ఉంటాయి. అలాగే అటు విజయనగరం ఇటు బొబ్బిలి రైల్వేస్టేషన్లకు కూడా జాతీయ రహదారి దగ్గరగా ఉండడంతో దూర ప్రాంతం నుంచి వచ్చే విద్యార్థులకు ప్రయాణం సులభతరమవుతుంది. దీంతో వెనుకబడిన ఈప్రాంతం కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఇక్కడి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గత ఏడాది ఆగస్టులో భూమిపూజ

గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి ప్రభుత్వం చేపట్టిన చొరవను చూసి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 2023 ఆగస్టు 25న గిరిజన యూనివర్సిటీకి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి మెంటాడ మండలంలోని కుంటినవలస వద్ద శంకుస్థాపన చేశారు.

త్వరితగతి వర్సిటీ నిర్మాణం

ప్రభుత్వం సేకరించిన 561.88 ఎకరాల్లో ప్రస్తుతం 20 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణం ఏడు కోట్ల రూపాయలతో జరుగుతోంది. గిరిజన యూనివర్సిటీ స్థలం చుట్టు ప్రహరీ నిర్మాణానికి మార్కింగ్ పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి అధికారులు స్థల సేకరణ ఇప్పటికే పూర్తి చేశారు. యూనివర్సిటీ మధ్యలో వాచ్‌టవర్ నిర్మాణం పూర్తయింది. ప్రభుత్వం రూ.800 కోట్ల నిధులు మంజూరు చేయడంతో భవనాల నిర్మాణం చేపట్టనున్నామని అధికారులు తెలియజేస్తున్నారు.

టీడీపీ కుట్రలు సాగవు

గిరిజన యూనివర్సిటీని గతంలో అనువుగాని చోట నిర్మించాలని టీడీపీ ఎన్నో కుట్రలు చేసింది. గిరిజనులు ఉన్న చోట నిర్మించాలని ఎంతో మంది నిపుణులు ప్రణాళికలు సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి అందజేయడంతో గిరిజన నియోజకవర్గమైన సాలూరులో నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. నిర్మాణానికి కావలసిన భూములు సాలూరు నియోజకర్గంలోని మెంటాడ మండలం చినమేడపల్లితో పాటు గజపతినగరం నియోజకవర్గంలోని దత్తిరాజేరు మండలం మర్రివలస గ్రామాల్లో సేకరించడంతో గిరిజన వర్సిటీ నిర్మాణానికి అధికారులు సిద్ధమయ్యారు. ఈ ప్రాంతం విద్యాపరంగా అభివృద్ధి చెందుతుంది. యువతకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయన్నది ఈ ప్రాంతీయుల మాట.


యూనివర్సిటీ మధ్యలో నిర్మాణం జరిగిన వాచ్‌టవర్